## దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత



సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ రంజిత్‌రెడ్డి

శంకర్‌పల్లి, జనవరి 20 : దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు రంజిత్‌రెడ్డి అన్నారు. శనివారం శంకర్‌పల్లి మండలం మహాలింగాపురం గ్రామంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు మాచన్నగారి రాఘవేందర్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం అయోధ్య లో శ్రీరాముడికి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో సీతారాముల విగ్రహాలకు అభిషేకం చేశారు. పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహ దాత రాఘవేందర్‌ను ఎంపీ అభినందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన జేపీ దర్గా ఉర్సు

**ప్రత్యేక ప్రార్థనలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



ప్రార్థనలు చేస్తున్న కొండల్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు, జనవరి 20 : జేపీ దర్గా ఉర్సు చివరి రోజు శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఖురాన్‌ను పఠించారు. మూడు రోజుల పాటు సాగిన దర్గా ఉర్సు శనివారం ముగిసింది. చివరి రోజు సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ జేపీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సులో భాగంగా మొదటి రోజు గంధోత్సవం, రెండో రోజు దీపారాధన, చివరి రోజు ఖురాన్ పఠనంతో ఉత్సవాలు ముగిశాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## రాముడి సిద్ధాంతాలు వేరు.. బీజేపీ పాలన తీరువేరు

- దేవుడి పేరుతో బీజేపీ రాజకీయం చేస్తుంది
- అభినందన సభలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

షాద్‌నగర్‌టౌన్, జనవరి 20: రాముడి సిద్ధాంతాలు వేరు.. బీజేపీ పాలన తీరువేరని, దేవుడి పేరుతో బీజేపీ రాజకీయం చేస్తున్నదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. షాద్‌నగర్‌లో శనివారం నిర్వహించిన సీపీఐ అభినందన సభలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. ఏ పార్టీ సిద్ధాంతాలైనా ప్రజా సంక్షేమం కోసం పుట్టాయన్నారు. శ్రీరాముడి పేరు చెప్పుకుని అధికారంలోకి వచ్చని బీజేపీ శ్రీరాముడి ఆశయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదన్నారు. అనంతరం ఎమ్మెల్యేలను సీపీఐ నాయకులు పూల మాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు విశాల, వెంకట్రాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యామ్‌సుందర్, కాంగ్రెస్, సీపీఐ నాయకులు పర్వతాలు, జంగయ్య, రవీంద్రచారి, రామస్వామి, బాబర్‌ఖాన్, వెంకటేష్, షకీల్, గోవింద్, జంగయ్య, చంద్రబాబు, లింగం, పవన్, చెన్నయ్య పాల్గొన్నారు.




సభలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి





## అలా.. ఆకాశవీధిలో..



బేగంపేట విమానాశ్రయంలో 'వింగ్స్ ఇండియా–2024' వైమానిక ప్రదర్శన మూడోరోజు శనివారం సైతం సందడిగా సాగింది. పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. ఎగ్జిబిషన్‌లో కొలువుదీరిన విభిన్న రకాల లోహ విహంగాల ముందు సెల్ఫీలు దిగుతూ.. సంబురపడ్డారు. నింగిలో రంగు రంగుల పొగలు చిమ్ముతూ.. విమానాలు, హెలికాప్టర్లతో చేసిన విన్యాసాలు అబ్బురపర్చాయి. నేడు ప్రదర్శన చివరి రోజు కావడంతో భారీగా సందర్శకులు వచ్చే అవకాశం ఉన్నది.



## తాండూరులో 40 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడ్డ గంజాయితో పోలీసులు

తాండూరు, జనవరి 20 : వికారాబాద్ జిల్లా తాండూరులో శనివారం ఎక్సైజ్ పోలీసులు 40 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనేశ్వర్–ముంబయి వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైల్లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా తమిళనాడుకు చెందిన పీటర్ ఫ్రాన్సెన్ అనే వ్యక్తి దగ్గర 40 కేజీల గంజాయి లభించినట్లు తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. పూర్తి విచారణ అనంతరం ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి జైలుకు పంపినట్లు వివరించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ అధికారులు ధన్వంత్‌రెడ్డి, అనంతయ్య, కోటేశ్వర్‌రావు, చంద్రకాంత్‌రెడ్డి, చిన్నరాముడు తదితరులు ఉన్నారు.

## రాములోరి దర్శనానికి స్పెషల్ రైళ్లు

**ఈ నెల 29 నుంచి మార్చి 3 దాకా సేవలు**

పెద్దపల్లి, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : అయోధ్య రాములవారి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 22న జరుగనుండగా, రైల్వే శాఖ మన రాష్ట్రం నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది. ఈ నెల 29 నుంచి వచ్చే మార్చి 3 వరకు స్పెషల్ సర్వీసులు నడపాలని నిర్ణయించి, వాటి వివరాలు వెల్లడించింది.

సికింద్రాబాద్ జంక్షన్ నుంచి అయోధ్య ధాం జంక్షన్‌కు రైలు నంబర్ (07221)ను నడుపనున్నారు. ఇది ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 29 మధ్య వారంలో మూడు రోజుల (మొత్తం 16ట్రిప్‌లు)పాటు నడుస్తుంది. ఇది జనవరి 29, 31, ఫిబ్రవరి 2, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29 తేదీల్లో సాయంత్రం 4:45 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ నుంచి బయలుదేరుతుంది. మార్గమధ్యంలో కాజీపేట జంక్షన్‌కి సాయంత్రం 6:20 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కి రాత్రి 7:38కు, రామగుండానికి రాత్రి 8 గంటలకు వచ్చి, రెండ్రోజుల ప్రయాణం తర్వాత ఉదయం 3:30 గంటలకు అయోధ్యకు చేరుకుంటుంది. తిరిగి అయోధ్య నుంచి సికింద్రాబాద్ జంక్షన్ వరకు రైలు నంబర్ (07222) ఫిబ్రవరి 1, 3, 5, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 తేదీల్లో, మార్చి 1, 3 తేదీల్లో నడుస్తుంది. ఇది అయోధ్య నుంచి మధ్యాహ్నం 2:20 గంటలకు బయలు దేరి మరుసటి రోజు రాత్రి 10:30 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ చేరుకుంటుంది. మార్గమధ్యంలో రామగుండానికి సాయంత్రం 06:30, పెద్దపల్లి జంక్షన్‌కి 7కు, కాజీపేట జంక్షన్‌కి 8:08 గంటలకు చేరుకుంటుంది.

## నేరాలు తగ్గించేందుకు ముఖ్య పాత్ర పోషించాలి

వికారాబాద్, జనవరి 20 : జిల్లాలో నేరాలను తగ్గించేందుకు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని ఎస్పీ నంద్యాల కోటి రెడ్డి సూచించారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సంవత్సరంలో చేసిన తనిఖీల్లో భాగంగా సీసీఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం సీసీఎస్‌కు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. సీసీఎస్ అధికారులు క్రైమ్ పైన అవగాహన కలిగి ఉండాలని, పదే పదే నేరాలకు పాల్పడే వారిపై రికార్డులు నమోదు చేసి, కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు బల్వంతయ్య, బాలస్వామి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

## సీఎంఆర్ రైస్ టార్గెట్ వారం రోజుల్లోగా పూర్తి చేయాలి

**కలెక్టర్ నారాయణరెడ్డి**

వికారాబాద్, జనవరి 20 : వానకాలానికి సంబంధించిన సీఎంఆర్ రైస్ టార్గెట్ వారం రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వానకాలానికి సంబంధించిన సీఎంఆర్ టార్గెట్‌పై రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు నిర్దేశించిన టార్గెట్‌కు అనుగుణంగా వానకాలం టార్గెట్లను పూర్తి చేసి అందజేయాలన్నారు. రైస్ మిల్లర్స్ కలిసికట్టుగా టార్గెట్‌ను అధిగమించేందుకు చొరవ చూపాలన్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు విధులపై నిర్లక్ష్యం చేయవద్దన్నారు. రైతులకు లాభం కలిగేలా కృషి చేస్తానన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలేశ్వర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

**వారం రోజుల్లో ప్రభుత్వ దవాఖాన పనులు పూర్తి చేయండి**

నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వాసుపత్రిలో బయటి రోగులకు సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. శనివారం వికారాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ దవాఖానను సందర్శించి కాంట్రాక్టర్, అధికారులతో పనులపై ఆరా తీశారు. వారం రోజుల్లోగా బయటి రోగులకు సేవలు అందించే దిశగా ఏర్పాట్లు చేయాలన్నారు. ముందుగా గ్రౌండ్ ఫ్లోర్‌లో రోగులకు సేవలు అందించేందుకు సదుపాయాలు సమకూరుస్తూనే, మిగతా పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్ పనులను పూర్తి చేయాలని తెలిపారు. కలెక్టర్‌తో పాటు వికారాబాద్ మండల తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

# విరగబూసిన మామిడి

- పూతను కాపాడుకోవడానికి యాజమాన్య పద్ధతులు తప్పనిసరి
- రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు
- రంగారెడ్డి జిల్లాలో 27వేల ఎకరాల్లో మామిడి సాగు



ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 20 : ఈసారి మామిడి పూత అత్యధికంగా రావడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 27వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. పూత రాలడాన్ని అరికడితే దిగుబడి సైతం అధికంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాద్‌నగర్, ఆమనగల్లు, చేవెళ్ల తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మామిడి తోటలు ఉన్నాయి. పూతను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. రైతులు అధికారుల సూచనలు, సలహాలను తీసుకుని సకాలంలో మందులను పిచికారీ చేస్తున్నారు.

### పూతదశలోనే నీరందించాలి..



జిల్లాలో మామిడిపూత వివిధ దశల్లో ఉన్నది. రైతులు మామిడికి క్రమంగా నీరందించాలి. మామిడి పంటకు తడి ఆరకుండా నీరందించడంతో పాటు సరైన మెళకువలు పాటించాలి. పూతదశలో ఉన్న మామడికి 13-0-45ను లీటరు నీటిలో 10గ్రాములు, ప్లానోఫిక్స్‌ను 0.2మి.లీ 1లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే పూత రాలిపోకుండా ఉంటుంది. ప్రస్తుతం మామిడికి తామరపురుగు, తేనెమంచు, బూజు తెగులు ఆశిస్తున్నందున 0.5మి.లీ ఎక్సాకోనజోల్ లేదా 2మి.లీ కాన్ఫడార్‌ను 1లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే తెగులు ఆశించకుండా పంట మంచి దిగుబడి వస్తుంది.

– శ్రీకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త

**మామిడి సాగుకు అనుకూలమైన నేలలు..**

మామిడి సాగుకు అన్ని నేలలు అనుకూలం. చౌడు, నీరు నిల్వ ఉండే బరువైన నల్లరేగడి నేలల్లో నాటరాదు. లోతైన నేలల్లో వేర్లు బాగా వ్యాపించి, చెట్లు, అభివృద్ధి చెంది చాలా కాలం ఫలాలనిస్తాయి. ఉదజని సూచిక 7.5-8.0 ఉన్న నేలలు మరింత అనుకూలం. మామిడి తోటల్లో చెట్లు బాగా పెరిగి, మంచి దిగుబడులు పొందాలంటే సరైన పోషకాలు సమ పాళ్లలో అందించాలి. భూసార పరీక్షల ఆధారంగా పోషకాల లభ్యతను పరిగణలోకి తీసుకుని, సిఫారసు చేసిన ఎరువులను వాడాలి.

**మామిడిలో కలిగే సూక్ష్మదాతు లోపాలు..**

చౌడు నేలల్లో జింకు లోపం ఎక్కువగా కనిపిస్తుంది. ఈ నేలల్లో మొక్కల పెరుగుదల క్షీణించి చనిపోతాయి. పెరుగుదల దశలో జింకు లోపముంటే ఆకులు చిన్నవిగా మారి సన్నబడి పైకి లేదా కిందికి ముడుచుకుపోతాయి. ఆకులు గులాబీ రేకుల వలే గుబురుగా తయారవుతాయి. దీంతో దిగుబడి తగ్గిపోతుంది. బోరాన్ లోపంతో చెట్ల ఆకులు కురచబడి ఆకుకొనలు నొక్కుకుపోయి పెలుసుగా తయారవుతాయి. ఇనుపదాతు లోపంతో చెట్ల ఆకులు పచ్చదనం కోల్పోయి తెల్లగా పాలిపోతాయి. ఆకుల సైజు తగ్గిపోయి తీవ్ర లోపం ఉన్న మొక్కల ఆకులపై నుంచి కిందికి ఎండిపోతాయి.

**నివారణ చర్యలు..**

సూక్ష్మ లోపాలు అధికంగా ఉన్న తోటల్లో చెట్టుకు 50 నుంచి 75గ్రాముల బోరాక్స్, 125 నుంచి 150గ్రాముల జింక్ సల్ఫేట్, 125 నుంచి 150గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ జూలై, ఆగస్టు నెలల్లో పాదులో వేయాలి. జింక్, బోరాన్ లోప తక్షణ నివారణకు ఒక్క గ్రాము చీలేటెడ్ జింకు, 1.25 గ్రాముల బోరాన్, 19శాతం లీటర్ నీటిని 125 గ్రాముల బోరాన్‌ను వంద లీటర్ల నీటిలో కలిపి కొత్త చిగురు వచ్చే సమయంలో, పూ మొగ్గల పెరుగుదల దశలో చెట్లు బాగా తడిసేలా విరివిగా చేయాలి. ఇనుపదాతులో నివారణకు 2.5 గ్రాముల అన్నబేది, ఒక్క గ్రామ నిమ్మ ఉప్పు లేదా ఒక బద్ద నిమ్మకాయ రసం లీటర్ నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలోనే రెండుసార్లు పిచికారీ చేయాలి.

### సమగ్ర ఎరువుల యాజమాన్యం పద్ధతి..

- తక్కువ వర్షపాతం ఉన్న ప్రదేశాల్లో ఎరువులు, పోషక పదార్థాలను వర్షాకాలం ఆరంభంలోను, ఎక్కువగా వర్షపాతం ఉన్న ప్రదేశాల్లో వర్షాకాలం చివర్లో వేసుకోవడం ద్వారా ఎరువుల వృథాను అరికట్టవచ్చు.
- ఎదిగిన చెట్లలో ఎరువులను చెట్టు కాండానికి 1.5 మీటర్ల దూరంలో 15 సెం.మీ లోతు పాదులో వేసి పూడ్చాలి.
- ఒక్కో మొక్కకు మొదటి ఏడాది 100 గ్రాముల నత్రజని, 100 గ్రాముల భాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. వీటిని ప్రతి ఏడాది వంద గ్రాముల చొప్పున పెంచుతూ.. పదో సంవత్సరం తర్వాత ఒక్కో కిలో నత్రజని, భాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులను వాడాలి.
- ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి మొదటి వారంలో పిందె ఏర్పడిన తర్వాత సిఫారసు చేసిన ఎరువుల్లో నాలుగో భాగం మొక్కకు అదనంగా ఇస్తే ఎక్కువ దిగుబడి పొందడంతో పాటు మలి ఏడాది కాపునకు దోహదపడుతుంది. మామిడి మొక్కల పెరుగుదలకు, నాణ్యమైన దిగుబడులకు ప్రధాన పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాల అవసరం చాలా ముఖ్యం. సూక్ష్మపోషక లోపాలను నేలలో వాటికి సంబంధించిన ఎరువులు వేసుకుని లేదా సిపారసు ప్రకారం మందు ద్రావణాన్ని చెట్లపై పిచికారీ చేసి నివారించాలి.

## 23న పరిగిలో మెగా జాబ్ మేళా

**ఉపాధి కల్పన జిల్లా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్**

వికారాబాద్, జనవరి 20 : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు పరిగి పట్టణంలో ఈ నెల 23న ఉదయం 10 గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ శనివారం తెలిపారు. తెలంగాణలోని ప్రముఖ 50 కంపెనీల్లో 5వేల మంది నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు పరిగి పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ నంబర్ 1లో ఈ మేళా నిర్వహిస్తున్నామన్నారు. పది, ఇంటర్, డి గ్రీ, ఐటీఐ, ఎంబీఏ, ఎంసీఏ, బీఈ, బీటెక్ విద్యార్హతలు ఉన్న అభ్యర్థులు పాల్గొనాలని తెలిపారు. ఇ తర వివరాలకు జాబ్ మేళా నిర్వాహకు డు మియాసాబ్‌ను 9676047444, 9182477163, 6305197076 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను చేపట్టాలి

**పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్**

కడ్తాల్, జనవరి 20 : 317 జీవో ద్వారా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలను చేపట్టాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్ కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు బదిలీపై చంపాపేట్ జడ్పీహెచ్‌ఎస్‌కి వెళ్లిన, హెచ్‌ఎం విజయకు శనివారం పాఠశాలలో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆమెను పీఆర్టీయూ నాయకులతోపాటు ఉపాధ్యాయ బృందం పూలమాలలు, శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు అరుణ, యాదయ్య, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మావతమ్మ, సుగుణదేవి, లక్ష్మారెడ్డి, వినయ్, ధనుంజయ్య, మల్లయ్య పాల్గొన్నారు.



హెచ్‌ఎం విజయను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం